సాక్షి
వికారాబాద్

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



బాలికల రక్షణకే షీటీం

బాలికల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని ఎస్‌ఐ ప్రవీణ్ అన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. 8లో▸



ప్రభుత్వ పాఠశాలల్లో..

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్ అన్నారు. 8లో▸



వరుస కుంభకోణాలు!

తెలంగాణ గ్రామీణ బ్యాంకులు ఆర్థిక నేరాలకు అడ్డాగా మారాయి. కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. 9లో▸

ఆగిన ప్లాన్

మున్సిపాలిటీల మాస్టర్ ప్లాన్ తయారీ ప్రారంభానికే పరిమితం



వికారాబాద్‌లో డ్రోన్ సర్వేని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ (ఫైల్)

- అమృత్ 2.0 పథకం కింద పది నెలల క్రితం సర్వే
- వికారాబాద్, తాండూరు పురపాలికల ఎంపిక
- డ్రోన్ సాయంతో 'డిజిటల్'కు రూపకల్పన
- 40 సంవత్సరాల పాటు ఉపయోగపడేలా కార్యాచరణ
- ముందుకు సాగని ప్రక్రియ

వికారాబాద్: మున్సిపాలిటీల మాస్టర్ ప్లాన్ సర్వే ప్రారంభానికే పరిమితమైంది. పది నెలల క్రితం ప్రక్రియ చేపట్టినా నేటికీ పూర్తి కాలేదు. రాష్ట్రంలో మన జిల్లా నుంచే డిజిటల్ ప్లాన్‌కు రూపకల్పన చేశారు. అయితే అధికారుల వద్ద సర్వే ఎంత వరకు వచ్చిందనే సమాచారం లేకపోవడం గమనార్హం. మాస్టర్ ప్లాన్ తయారీకి ప్రభుత్వం డ్రోన్లను వినియోగించింది. 30 నుంచి 40 సంవత్సరాల వరకు ఉపయోగపడేలా డిజిటల్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 50 వేలకు పైగా జనాభా ఉన్న పురపాలికల్లో సర్వే చేయాలని భావించారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉండగా వికారాబాద్, తాండూరును ఎంపిక చేశారు. సర్వే ఆఫ్ ఇండియా వారు ముందుగా వికారాబాద్‌లో ఆ తర్వాత తాండూరులో సర్వే ప్రక్రియను ప్రారంభించారు. తాండూరులో విద్యుత్ తీగలు డ్రోన్‌కు తగిలి అది పేలిపోయింది. అంతటితో ప్రక్రియ ఆగిపోయింది.

భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా..

భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా డిజిటల్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. మున్సిపాలిటీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా.. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నా.. నిర్మాణాలు చేయాలన్నా ఈ మాస్టర్ ప్లాన్ ఉపయోగపడేలా తయారు చేయాలని నిర్ణయించారు. మున్సిపాలిటీ ఉపరితలం ఎత్తు, చెరువులు, వాగులు, డ్రైనేజీలు, ఇళ్లు, చెట్లు, రోడ్లు, వైకుంఠధామాలు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, భవన సముదాయాలు, మార్కెట్లు, సెల్ టవర్లు, టాయిలెట్లు, వాటర్ ట్యాంకులు, రిజర్వాయర్లు తదితర వనరులన్నింటినీ మ్యాపింగ్ చేస్తారు. అనంతరం మ్యాపుల ఆధారంగా 40 సంవత్సరాల అవసరాలకు తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్ తయారు చేసి మున్సిపాలిటీలకు అందజేస్తారు. భవిష్యత్ తరాలకు ఇది ఎంతగానో ఉపయోగపడనుంది.

విడతల వారీగా..

కేంద్ర ప్రభుత్వం విడతల వారీగా మున్సిపాలిటీలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తాండూరుకు రూ.27 కోట్లు, పరిగికి రూ.15.5 కోట్లు, వికారాబాద్‌కు రూ.12 కోట్లు, కొడంగల్‌కు రూ.4.5 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను వాటర్ సప్లయ్, తాగు నీటి వనరుల అభివృద్ధి కోసం వినియోగిస్తున్నారు. ప్రస్తుతం తయారు చేస్తున్న మాస్టర్ ప్లాన్ ఆధారంగా భవిష్యత్తులో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. రోడ్లు, డ్రైనేజీ, తాగు నీటి వనరులు, మార్కెట్లు, డంపింగ్ యార్డులు తదితర వాటికి ఈ ప్లానే ఆధారం కానుంది.

న్యూస్‌రీల్

బాధ్యతగా పని చేద్దాం

- ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలి
- మున్సిపల్ కమిషనర్ యాదగిరి



మాట్లాడుతున్న కమిషనర్ యాదగిరి

తాండూరు టౌన్: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ యాదగిరి హెచ్చరించారు. శనివారం మున్సిపల్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు ప్రజల సమస్యలను శ్రద్ధగా విని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పనులను పెండింగ్‌లో ఉంచరాదన్నారు. వార్డు ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. పన్నుల వసూలులో బిల్‌కలెక్టర్లు శ్రద్ధ వహించాలన్నారు. త్వరలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వార్డుల్లో చెత్త లేకుండా చూడాలన్నారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా జరిగాలని ఆదేశించారు. వెలగని వీధి దీపాలను తక్షణం మార్చి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనితీరు సరిగ్గా లేకుంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, డీఈ మణిపాల్, ఏఈ ఖాజా హుస్సేన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి

మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

పరిగి: విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్షలకు సన్నద్ధం కావాలని మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ సూచించారు. శనివారం మండలంలోని జాఫర్‌పల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల ప్రగతి రిపోర్టు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



జ్యోత్స్నారాణిని సన్మానించిన అధ్యాపకులు

పరిగి: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఇంటర్మీడియట్ జాయింట్ సెక్రటరీ జ్యోత్స్నారాణి అన్నారు. శనివారం పరిగి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే కష్టపడి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ శంకర్, మెడికల్ బోర్డు డీడీ విద్యులత, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను బాగు చేయండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతగిరి: మండలంలో దెబ్బతిన్న రోడ్లను వెంటనే బాగు చేయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం రోడ్ల సమస్యలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వికారాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్, పార్లమెంట్ కో కన్వీనర్ అమరేందర్ రెడ్డి, సెన్సార్ బోర్డ్ మెంబర్ బసవలింగం, మాజీ కౌన్సిలర్ శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజ్, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, సుధాకర్, మండల అధ్యక్షులు శివరాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు గోపాల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ధాన్యం సేకరణకు సిద్ధంకండి

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలి
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న రకం వడ్ల సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో లక్షా 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నట్లు వివరించారు. ఇందులో దొడ్డు రకం 31,200 మెట్రిక్ టన్నులు, సన్న రకం 73,800 మెట్రిక్ టన్నులు సేకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అన్ని యంత్రాలను, గన్నీ బ్యాగులను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజరత్నం, డీసీఎస్‌ఓ సుదర్శన్, డీఎంసీఎస్ మోహన్ కృష్ణ, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, డీసీఓ నాగార్జున, డీసీఎంఎస్ మార్కెటింగ్ మేనేజర్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

మీసేవ కేంద్రం నిర్వాహకులు సర్టిఫికెట్ల జారీ విషయంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని లింగ్యానాయక్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీసేవ కేంద్రం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన రుసుం మాత్రమే వసూలు చేయాలని ఆదేశించారు. అలా కాకుండా ఎక్కువ తీసుకుంటే మీసేవ కేంద్రం గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు. మీసేవ కేంద్రాలను వ్యాపార పరంగా కాకుండా సేవా దృక్పథంతో నడపాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ ప్రజలు, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని తెలిపారు. అనుమతి పొందిన ప్రాంతాల్లోనే కేంద్రాలను నిర్వహించాలని, వేరే చోటికి మార్చాల్సి వస్తే అధికారుల నుంచి అనుమతి పొందాలని పేర్కొన్నారు. కేంద్రాల నిర్వహకులు ఇబ్బంది పెడితే 1100 కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో జిల్లా మేనేజర్ మహమూద్, మీసేవ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం



రికార్డులు పరిశీలిస్తున్న సదానందం

- సిబ్బంది కొరత ఉన్నా పశువైద్యానికి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం
- పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ సదానందం

తాండూరు రూరల్: విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ సదానందం హెచ్చరించారు. శనివారం తాండూరులోని ఏడీఏ కార్యాలయాన్ని సందర్శించారు. సబ్ సెంటర్ డాక్టర్లు, కాంపౌండర్లు, గోపాల మిత్రలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సిబ్బంది కొరత ఉన్నా సర్దుబాటు చేసి పశువులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. 34 డాక్టర్ పోస్టులకు గాను 10 ఖాళీగా ఉన్నాయన్నారు. 60 సబ్ సెంటర్లలో 35 కాంపౌండర్ పోస్టులు భర్తీ కాగా 25 ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. విధులకు సక్రమంగా హాజరుకాని తాండూరు ఇన్‌చార్జ్ ఏడీఏపై చర్యలు తీసుకుంటామన్నారు. ధారూరు మండలం కుక్కింద సబ్ సెంటర్ కాంపౌండర్‌ను ఏడీఏ కార్యాలయానికి డిప్యూటేషన్ వేసినట్లు తెలిపారు. పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించారు.

జీతాలు ఇప్పించండి సారూ..

ఐదు నెలలుగా జీతాలు రాక అవస్థలు పడుతున్నామని గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ సదానందం కోరారు. జిల్లాలో 56 మంది గోపాలమిత్రలు పని చేస్తున్నారని, ప్రతి నెలా జీతం అందేలా చూడాలని విన్నవించారు.

'అభయహస్తం' సంచులు సిద్ధం



అభయహస్తం బ్యాగు

తాండూరు: రేషన్ బియ్యం లబ్ధిదారులకు ప్రత్యేక సంచులు అందజేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. నాణ్యమైన కాటన్, పేపర్‌తో తయారు చేసిన బ్యాగులు ఇప్పటికే తాండూరులోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు చేరుకున్నాయి. నియోజకవర్గంలోని 66,321 మంది లబ్ధిదారులకు ఒక్కోటి చొప్పున అందజేయనున్నారు. బ్యాగులపై ఆరు గ్యారంటీల అభయ హస్తం లోగోతో పాటు ఇందిరాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలను ముద్రించారు. నిత్యావసర సరుకులు తెచ్చుకునే విధంగా వీటిని రూపొందించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి అడ్డుకట్ట వేయడంతో పాటు పర్యావరణ హితానికి ఇవి దోహదం చేస్తాయని గోదాం ఇన్‌చార్జ్ రవి తెలిపారు. నియోజకవర్గంలోని 249 రేషన్ దుకాణాల ద్వారా 1,200 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

శాంతిభద్రతల్లో రాజీపడం

- పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి
- ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: శాంతిభద్రతల విషయంలో రాజీ పడేదిలేదని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై శనివారం జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు చేసుకోకుండా తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలకు వెళ్లి బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలని సూచించారు. ఇది పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అధికారులు తమ సిబ్బందితో నిరంతరం సమావేశాలు నిర్వహించుకొని, పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలన్నారు. నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా ప్రవర్తించాలని తెలిపారు. డీఎస్పీ స్థాయి అధికారులు వారివారి పరిధిలో ప్రతి నెలా కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించి, ప్రజలకు మరింత దగ్గర కావాలని సూచించారు. జిల్లాలో గ్యాంగ్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహితంగా మార్చడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

మర్పల్లి: బీసీ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న నగరంలో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అధ్యక్షతన జరిగే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చొరవ చూపాలని కోరారు.

విస్తరాకుల తయారీతో ఉపాధి

- చెంచులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్



విస్తరాకుల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

కుల్కచర్ల: ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సౌకర్యాలను చెంచు ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం మండలంలోని సాల్వీడు గ్రామంలో సయోధ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విస్తరాకుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెంచుల సంక్షేమానికి ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకొని జీవన విధానాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. చెంచులకు అవసరమైన ధ్రువపత్రాలు వెంటనే అందించేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులకు సూచించారు. విస్తరాకుల తయారీ రంగంలో మరింత మందికి ఉపాధిని కల్పించేటా చూడాలని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, ఏపీడీ నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ రామకృష్ణ, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సంతోష, చెంచు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యసనాలకు లోనుకావొద్దు

- చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- కొడంగల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీరాం
- దౌల్తాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శన



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీరాం

దౌల్తాబాద్: విద్యార్థులు వ్యసనాలకు బానిస కారాదని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కొడంగల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీరాం సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతలు, హక్కులు, విధుల గురించి తెలుసుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివిన చాలా మంది నేడు అత్యున్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. మీరు కూడా భవిష్యత్‌లో ఆ స్థాయికి ఎదగాలని సూచించారు. బాగా చదువుకొని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం అడ్వకేట్లు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో అడ్వకేట్లు వెంకటయ్య, బస్వరాజ్, రమేష్, ప్రిన్సిపాల్ వసంత తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీరందించాలి

విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని న్యాయమూర్తి శ్రీరాం ప్రిన్సిపాల్‌కు సూచించారు. కళాశాలలోని ట్యాంక్ సరిగ్గా లేకపోవడంతో దాని గురించి ఆరా తీశారు. అనంతరం ప్రిన్సిపాల్ వసంత మాట్లాడుతూ.. దౌల్తాబాద్‌కు కళాశాల కొత్తగా మంజూరైందని తెలిపారు. ప్రస్తుతం నిధులు కేటాయింపు జరగలేదని వివరించారు. ప్రస్తుతం విద్యార్థులకు ఫిల్టర్ నీరు అందిస్తున్నామని జడ్జికి వివరించారు. కళాశాలలో కొత్త ట్యాంక్ ఏర్పాటు చేయాలని సోమవారం కలెక్టరుకు లేఖ రాయనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్, ఎంఈఓ రాంరెడ్డి



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న అధికారులు

దుద్యాల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన, మౌలిక సదుపాయాలు ఉంటాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్, ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. శనివారం సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో కొడంగల్ మండల పరిధిలోని ఉడిమేశ్వరం, అంగడిరాయిచూర్, ధర్మపూర్, టేకుల్‌కోడ్, అన్నారం, పాటిమీది పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై గంజాయి మొక్కల సాగు

నిందితుడికి రిమాండ్



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ సహదేవుడు

మోమిన్‌పేట: ఇంటి డాబాపై గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్‌ఐ సహదేవుడు తెలిపారు. గ్రామానికి చెందిన బూర్జుగడ్డ మహ్మద్ ఫతేబాబా తన ఇంటిపై రెండు గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు శనివారం తమ సిబ్బందితో వెళ్లి రెండు మొక్కలు సాగు చేసినట్లు గుర్తించాం. వాటిని స్వాధీనం చేసుకుని ఫతేబాబాను రిమాండ్‌కు తరలించామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

శనీశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నవాబుపేట: మోమిన్‌పేట్ మండలం ఎన్కతల గ్రామంలో వెలసిన శనీశ్వర ఆలయంలో పొలాల అమావాస్యను పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్

ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన ట్రాక్టరు

పరిగి: ఇనుప చువ్వలు తరలిస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట గేటు వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం గాజులకుంట తండాకు చెందిన రాములు నాయక్ మండల కేంద్రం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను గమనించకపోవడంతో బైక్‌తో ట్రాక్టర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదే విషయమై పోలీసులను సంప్రదించగా ప్రమాద విషయమై ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

బొంరాస్‌పేట: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై బాల వెంకటరమణ తెలిపిన ప్రకారం.. మహంతీపూర్‌కు చెందిన తిరుపతి లాలప్ప శనివారం తన ట్రాక్టరులో వాగునుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు జానకంపల్లి వద్ద పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మట్టి గణపతికి జై

- వినాయక ఉత్సవాల్లో పర్యావరణానికి పెద్దపీట
- మారుతున్న మండప నిర్వాహకుల ఆలోచనా ధోరణి
- మార్కెట్లో విరివిగా మట్టి విగ్రహాల విక్రయాలు
- ఆరు అంగుళాల నుంచి ఐదు అడుగుల ఎత్తు వరకు..
- రూ.150 నుంచి రూ.14 వేల వరకు ధర



భక్తుల ఆలోచనా ధోరణి మారింది. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారు. ప్రమాదకరమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, సింథటిక్ కలర్లతో తయారు చేసిన ఎత్తయిన విగ్రహాలకు బదులు స్వచ్ఛమైన బురద మట్టితో తయారు చేసిన ప్రతిమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మేరకు వాటి విక్రయాలు సైతం జోరందుకున్నాయి.

హుడాకాంప్లెక్స్: వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడంపై పర్యావరణవేత్తలు, న్యాయస్థానాలు ఆందోళన వ్యక్తం చేయడం.. పలు రకాల ఆంక్షలు విధించడం తెలిసిందే. ఎత్తయిన విగ్రహాల కొనుగోలు, రవాణా , మండపం ఏర్పాటు, ప్రతిష్ఠాపన, ఘనమైన పూజల నిర్వహణ, నిమజ్జనం వంటి అంశాల్లోనూ ఇబ్బందులు తలెత్తుతున్న విషయం విధితమే. కొన్ని సందర్భాల్లో భక్తులు ప్రమాదాలకు గురైన సంఘటనలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యక్తగత భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు పాటు పడేవిధంగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు.

కొనుగోళ్లకు ఆసక్తి

గతంలో ప్రధాన రోడ్లు, షాపుల్లో ఎటు చూసినా రంగులు అద్దుకున్న గణనాథుల విగ్రహాలే దర్శనమిచ్చేవి. ప్రస్తుతం మట్టి విగ్రహాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఆరు అంగుళాల నుంచి ఐదు అడుగుల ఎత్తు విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో విగ్రహం ఎత్తు, సైజును బట్టి రూ.150 నుంచి రూ.14 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇతర విగ్రహాలతో పోలిస్తే ధరలు కాస్త తక్కువగా ఉండటం, పర్యావరణహితంగా విగ్రహాలను తయారు చేయడంతో మెజార్టీ భక్తులు వీటి కొనుగోళ్లకే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్నారు.

మండపాల్లో జాగ్రత్తలు తప్పనిసరి

తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించే వేడుకల్లో జాగ్రత్తలు తప్పనిసరని నిపుణులు పేర్కొంటున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. విగ్రహాల తరలింపు, మండపం ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్లు, నిమజ్జనం వరకు ఇలా ప్రతి అంశంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

- మండపం ఏర్పాటుకు నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల నుంచి అనుమతి పొందాలి.
- మండపాలకు విద్యుత్ కనెక్షన్లు నేరుగా తీసుకోరాదు. డిస్కం ఇంజనీర్లకు సమాచారం ఇచ్చి, వారి అనుమతి మేరకే తీసుకోవాలి. స్తంభాలను నేరుగా ఎక్కడం కానీ, లైన్లకు వైర్లను వేలాడదీయడం కానీ చేయరాదు.
- లైన్ల కింది నుంచి విగ్రహాలను తరలించే సమయంలో తడిసిన కర్రలతో కానీ ఇనుప రాడ్లతో కానీ వైర్లను తాకరాదు. అలా తాకడం ద్వారా విద్యుత్‌షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.
- సాధారణంగా మండపంలో లైటింగ్ కోసం వైర్లకు అనేక చోట్ల జాయింట్లు వేస్తుంటారు. విద్యుత్ సామర్థ్యం మేరకు ఎంపిక చేసుకోవడంతో పాటు జాయింట్లు లేకుండా చూసుకోవాలి.
- ఎంసీబీలను విధిగా ఏర్పాటు చేసుకోవాలి. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే సంబంధిత ఇంజనీరుకు/ లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వాలి.
- రాత్రి పూట విగ్రహాలకు కాపలాగా నిర్వాహకులతో పాటు పోలీసు గస్తీ ఉండేలా చూసుకోవాలి.
- డీజే, ఇతర సౌండ్ సిస్టం ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా ఉండకూడదు. రాత్రి 10 గంటల తర్వాత సౌండ్ సిస్టం నిలిపివేయాలి. లేదంటే స్థానికుల నుంచి పోలీసుస్టేషన్లకు ఫిర్యాదు లు వెళ్లి కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.



సరూర్‌నగర్ ప్రధాన రహదారిపై మట్టి విగ్రహాల విక్రయం

పర్యావరణ హితం కోసమే..



సరూర్‌నగర్ పండాల అనిల్‌కుమార్ కాలనీలో ఎనిమిదేళ్ల క్రితం శ్రీ ఉమామహేశ్వర దేవాలయం నిర్మించాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు మట్టి గణపతినే ప్రతిష్ఠింపజేస్తున్నాం. పర్యావరణ హితం కోసమే మట్టి గణపతిని ఏర్పాటు చేస్తున్నాం. కాలనీలోని చిన్నా పెద్ద అంతా కలిసి తొమ్మిది రోజుల పాటు వైభవంగా వేడుకలు జరుపుకొంటాం.

– ఇంటూరి అంకిరెడ్డి, మండప నిర్వాహకుడు, సరూర్‌నగర్

24.12 ఎకరాలకు ఫెన్సింగ్

అధికారులతో వాగ్వాదానికి దిగిన రియల్టర్లు


మహేశ్వరం: మండల పరిధిలోని మంఖాల్ రెవెన్యూ తుక్కుగూడ పరిధిలోని వర్టెక్స్ వెంచర్ సమీపం సర్వే నెంబర్ 68, 70, 71, 73, 85, 86లో ఉన్న 24.12 ఎకరాల ప్రభుత్వ భూమికి రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు పోలీసుల సహకారంతో శనివారం చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ చేశారు. గతంలో ఈ భూమిని ప్రభుత్వం తుక్కుగూడలో భూమి లేని పేదలకు పంపిణీ చేసింది. సదరు భూమిని రైతులు ఓ రియల్ వ్యాపారికి విక్రయించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పీఓటీ నోటీసులు జారీ చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి చుట్టూ పోలీసుల సహకారంతో రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పలువురు రియల్ వ్యాపారులు రెవెన్యూ, హెచ్‌ఎండీఓ అధికారులకు అడ్డుతగిలి మా పట్టా భూమిని స్వాధీనం చేసుకోవద్దంటూ వాగ్వావాదానికి దిగారు. ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి జోక్యం చేసుకుని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేస్తున్నామని, పట్టా భూమి జోలికి రావడం లేదని సర్ది చెప్పారు. పట్టా భూమి ఉంటే సర్వే చేసి కొలిచి చూపుతామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. దీంతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి చుట్టూ పోలీసుల పహారాలో ఫెన్సింగ్ పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్, సీలింగ్ భూములను విక్రయిస్తే పీఓటీ కింద ప్రభుత్వం సాధీనం చేసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, హెచ్‌ఎండీఓ తహసీల్దార్ దివ్య, హెచ్‌ఎండీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్, మహేశ్వరం డిప్యూటీ తహసీల్దార్ నరేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులతో రియల్ వ్యాపారుల వాగ్వాదం

ఆక్రమణలు తొలగించిన హైడ్రా

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి సర్వే నంబర్ 201లోని శ్రీ సూర్య సాయి నగర్‌లో పార్కు ఆక్రమణలను శనివారం హైడ్రా అధికారుల బృందం కూల్చివేసింది. కాలనీలోని 482 గజాల విస్తీర్ణంలో 283, 284 నంబర్ ప్లాట్లను 2018లో మున్సిపాలిటీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. అయినప్పటికీ కొందరు స్థానికులు ప్రహరీ నిర్మించి ఆక్రమించారు. దీనిపై కాలనీవాసులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఇటీవల హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. తాజాగా హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పార్కు స్థలంలోని నిర్మాణాలను కూల్చివేశారు. కొలతలు వేసి, మున్సిపల్ అధికారుల చేత బోర్డు ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా తాము 20 ఏళ్లుగా సర్వే నంబర్ 159లో కబ్జాలో ఉన్నామని, గతంలో హైడ్రా నుంచి నోటీసులు వచ్చినప్పటికీ రిప్లై ఇచ్చామని, అవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టారని కబ్జాలో ఉన్న రైతులు వాపోయారు. గతంలో హైకోర్టు నుంచి వచ్చిన తీర్పు కూడా తమకు అనుకూలంగా ఉందని గుర్తు చేశారు. హైడ్రా ఏడీ సర్వే చేపట్టి రిపోర్టు ఆధారంగా భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.



తుర్కయంజాల్: జేసీబీతో ప్రహరీ కూల్చివేత

ప్రీకాస్టు వాల్ తొలగింపు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో హైడ్రా అధికారులు కొరడా ఝులిపించారు. రోడ్డుకు అడ్డంగా వేసిన ప్రీకాస్టు వాల్ తొలగించి రోడ్డుకు విముక్తి కల్పించారు. మున్సిపల్ కేంద్రంలోని బీరప్ప గుడికి సమీపంలో చక్రధర వెంచర్‌లో రోడ్డుకు అడ్డంగా కొంతమంది ప్రీకాస్టు వాల్ నిర్మించారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారుల దృష్టికి వెళ్లడంతో శనివారం హైడ్రా సీఐ తిరుమలేశ్ ఆధ్వర్యంలో జేసీబీలతో వాటిని తొలగించారు. ఈ సందర్భంగా సీఐ తిరుమలేష్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా పనులు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. నిర్భయంగా హైడ్రాను సంప్రదిస్తే తగున్యాయం చేస్తామని తెలిపారు.



కేజీబీవీ విద్యార్థులతో ఎస్‌ఐ ప్రవీణ్, షీటీం సిబ్బంది

బాలికల రక్షణకే షీటీం

ఎస్‌ఐ ప్రవీణ్

అనంతగిరి: బాలికల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని ఎస్‌ఐ ప్రవీణ్ అన్నారు. శనివారం వికారాబాద్ కేజీబీవీలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలిక లు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పబ్లి క్ ప్రదేశాల్లో షీటీం పోలీసులు మఫ్టీలో నిఘా ఉంచుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వరూప, సిబ్బంది బుచ్చేందర్, రేష్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయుడికి మెమో

బొంరాస్‌పేట: గాజులకుంటతండా ఏకోపాధ్యాయ పాఠశాలలో పనిచేస్తున్న వెంకటేశం కొంతకాలంగా విధులను నిర్లక్ష్యం నిర్లక్ష్యం చేస్తున్నారని తేలింది. శనివారం స్కూల్‌ను తనిఖీ చేసిన ఎంఈఓ హరిలాల్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. సదరు ఉపాధ్యాయుడు స్కూల్‌కు రాకుండా ఓ మహిళతో విద్యాబోధన చేయిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై అతనికి మెమో జారీ చేసినట్లు తెలిపారు. సోమవారం నాటికి దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వచ్చిన రిప్లేను జిల్లా విద్యాధికారికి పంపిస్తామని స్పష్టంచేశారు.



పాఠశాలలో ఉపాధ్యాయుడిని విచారిస్తున్న ఎంఈఓ హరిలాల్

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి



స్ట్రీట్‌ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన మెప్మా పీడీ వెంకటనారాయణ, కమిషనర్ బాలకృష్ణ

మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు స్వయం శక్తితో ఎదగాలని జిల్లా పట్టణ పేదరిక నిర్మూళన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వెంకటనారాయణ అన్నారు. మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళా స్వయం శక్తి సంఘాల ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటనారాయణ మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని తెలిపారు. ఆర్థిక ప్రగతితో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేలా సహాయ సహకారాలు అందించాలని చెప్పారు. మహిళా స్వయం సహాయ సంఘాలను బలోపేతం చేయడానికి దశల వారీగా వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్ట్రీట్ వెండర్స్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించామన్నారు. మహిళలను చైతన్యం చేసి స్వయం శక్తితో ఎదిగేలా చూడాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, ఏడీఎంసీ అశోక్, చైతన్యం, మేనేజర్ రమేశ్, టీపీఓ అబీబున్నీసాబేగం, డీఈ స్వర్ణ కుమార్, సీనియర్ అసిస్టెంట్ స్వప్న, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హరితం.. ఆహ్లాదం

- ఇంటి ఆవరణలో మొక్కలు నాటేందుకు అనువైన సమయం
- వనమహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ



ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

షాద్‌నగర్: ఇటీవల ఇంటి ఆవరణలో మొక్కల పెంపకంపై ఆసక్తి పెరిగింది. వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటడానికి అనువుగా ఉంటుంది. ప్రభుత్వం వనమహోత్సం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేస్తుంది.

వాయుకాలుష్యంతో ముప్పు

రోజు రోజుకు వాతావరణం కలుషితమవుతోంది. చెట్ల సంఖ్య తగ్గడంతో సహజంగానే ధూళి కణాలు గాలిల్లో కలుస్తున్నాయి. ఫలితంగా ఇది ప్రజారోగ్యానికి శాపంగా మారింది. ప్రతి ఏటా వాయు కాలుష్యంతో పలువురు మృత్యువాత పడుతుండగా ఎందరో అనారోగ్యానికి గురవుతున్నారు.

మొక్కలు నాటడం

- వర్షాలు కురుస్తుండటంతో ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటుకోవచ్చు.
- ఇండోర్ ప్లాంట్ల పై ఇటీవల ఆసక్తి కనబరుస్తున్నారు.
- మల్లె, చామంతి, గులాబీ, ఆరేకే ఫామ్, సైకస్, కాకస్, జెర్బరా, ఉసిరి, లిల్లీ, అశ్వగంధ, ఆర్కిడ్, క్రోటాన్, మనీప్లాంట్, స్నే ప్లాంట్, పుదీనా, తులసీ, అలోవెరా, సరస్వతీ తదితర రకాలు ఇంటి పరిసరాల్లో నాటుకోవచ్చు.
- జమ్మి, మేడి, ఉత్తరేణి, తెల్ల జిల్లేడు, దత్తాత్రేయ, మారేడు, గరిక, బ్రహ్మ కమలం, వంటి నవగ్రహాల మొక్కల సైతం నాటుకోవచ్చు.
- స్థలం ఎక్కువగా ఉంటే మామిడి, సీతాఫలం, జామ, వాటర్ ఆపిల్, బత్తాయి, జామ, దానిమ్మ, వంటి పండ్ల మొక్కలను నాటొచ్చు.

కురగాయలకు ఎండే అండ

నేల పై లేదా ఇంటి మేడ పై ప్లాస్టిక్ గ్రో బ్యాగులు, సిమెంట్ కుండీల్లో, పాత బకెట్లు, రంజన్లలో మొక్కలు పెంచుకోవచ్చు. అద్దె ఇంటిలో ఉంటున్న వారు కుండీల్లో పెంచితే మరో చోటుకు సులభంగా తరలించవచ్చు. తీగ జాతి మొక్కలతో చిన్న మొక్కలకు ఇబ్బంది రాకుండా తాళ్ల సాయంతో పైకి పాకించాలి. చీడ పీడలు ఆశిస్తే వేపనూనె లేదా కార్బండిజం, మ్యాంకోజెబ్, మోనోక్రోటోపాస్ కలిపిన మిశ్రమాన్ని మొక్కల పై పిచికారీ చేయాలి. రోజులో కనీసం ఆరు గంటలు సూర్యరశ్మి తగిలే ప్రాంతాల్లో టమాట, బీర, బెండ, పొట్ల, చిక్కుడు, కాకర, వంకాయ, మిరపలతో పాటు ఆకు కూరల సాగుకు అనుకూలంగా ఉంటుంది.

మట్టి ఎప్పుడు మార్చాలంటే..

- ప్రతీ రెండేళ్లకు వానాకాలం ఆరంభంలో కుండీల్లోని మట్టిని మార్చాలి.
- ఎర్ర మట్టి లేదా సారవంతమైన మన్ను, ఇసుక, పశువుల పేడ, వర్మికంపోస్టు, ఎండుటాకులు, రంపపు పొట్టు, బొగ్గు, లిండేన్ పొడిని కలిపి కుండీల్లో నింపుకోవాలి.
- కుండీల్లో తయారయ్యే అమ్మోనియాన్ని బొగ్గు పీల్చేస్తుంది. లిండేన్ పొడి పురుగులను చంపుతుంది. ఇసుక, ఆకులు, రంపపు పొట్టు నేలలో గాలి ప్రసరణకు, తేమను నిలిపేందుకు దోహద పడతాయి.
- అతి తక్కువ పరిమాణంలో యూరియా, డీఏపీ, పొటాష్, జింక్ కలిపి వేయాలి
- నీటిలో కరిగే ఎరువులను మొక్కల పై పిచికారి చేయాలి. కుండీల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి


పర్యావరణాన్ని కాపాడాలి



పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరు భాగస్వామ్యం కావాలి. వనమహోత్సం కార్యక్రమంలో భాగంగా పూలు, పండ్ల మొక్కలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నాం. ప్రతీ ఒక్కరు మొక్కలు, నాటడంతో పాటుగా వాటిని కాపాడాలి.

– సునీత, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

బీసీల చైతన్యమే లక్ష్యం



మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

ఇబ్రహీంపట్నం: బీసీల చైతన్యమే లక్ష్యంగా మన ఆలోచన సమితి సమితి (మాస్) పనిచేస్తుందని సమితి రాష్ట్ర అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం బీసీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన కోసం, మన పిల్లల కోసం, మన అందరి విముక్తి కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికారం దక్కే వరకు అలుపెరగని పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీల్లోని వివిధ కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం: వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సూచించారు. శనివారం ఓ ఫంక్షన్ హాల్‌లో డివిజన్ స్థాయిలో గణేశ్ ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ సునీతారెడ్డి మాట్లాడుతూ.. ఉత్సవ కమిటీ నిర్వాహకులు జాగ్రత్తలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. శాంతియుతంగా నిమజ్జన శోభాయాత్ర నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఆర్డీఓ అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం, మంచాల, ఫార్మాసిటీ, ఆదిబట్ల, మాడ్గుల సీఐలు, విద్యుత్ ఏఈ, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.